పారిశుద్ధ్య నిర్వహణ మెరుగవ్వాలి

- పనితీరు సరిగా లేకపోతే చర్యలు
- ఏలూరు కోఆప్షన్ సభ్యుడు పెదబాబు



శానిటరీ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు



సమావేశానికి హాజరైన శానిటరీ సిబ్బంది, శానిటరీ సెక్రటరీలు

ఏలూరు టౌన్: నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని సచివాలయ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పనితీరు మెరుగు పరుచుకోవాలి. లేకుంటే చర్యలు తప్పవని ఏలూరు కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ హెచ్చరించారు. ఏలూరు నగరపాలక సంస్థ పాత కౌన్సిల్ హాలులో మంగళవారం నగరంలోని 79 సచివాలయాల సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎంఆర్ పెదబాబు, నగర కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని శానిటేషన్ సిబ్బంది ప్రజలకు సేవ చేయడం కంటే హోటల్స్, బ్రాందీషాపులు, భవనాల నిర్మాణాల వద్ద రబ్బీస్‌ను తీసుకువెళ్లేందుకు, ఇళ్ల వద్ద నరికి పడేసిన చెట్లు, చెత్తాచెదారాన్ని తీసుకువెళ్లేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ సెక్రటరీలు ఉండే సచివాలయాలు అపరిశుభ్ర వాతావరణంతో ఉన్నాయని, నగరంలో అనేక ప్రాంతాలు దుర్గంధంగా మారాయని, ఇలాంటి పరిస్థితులను సహించేది లేదని స్పష్టం చేశారు. శానిటేషన్ సిబ్బందిపై అజమాయిషీ చేసే సూపర్‌వైజర్లు సైతం అలసత్వం ప్రదర్శిస్తున్నారని దీంతో అపరిశుభ్ర వాతావరణం పెరిగిపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏలూరు నగరంలో పర్యావరణం పూర్తిగా పాడైందని పనితీరులో మార్పు రావాలని నగర కమిషనర్ వెంకటకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ జీ.చంద్రయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.మాలతీ, కార్పొరేషన్ సెక్రటరీ దివ్యకుమారి, ఇన్‌ఛార్జి ఎంఈ డీ.కొండలరావు, డీఈ తాతబ్బాయి, ఏఈలు రాఘవేణి, రఫీ, సాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కెథడ్రల్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు



ఏలూరు మేత్రాసనంలో ధ్యాన వడకంలో పాల్గొన్న బిషప్‌లు, ఫాదర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కెథడ్రల్ చర్చ్‌లో మంగళవారం ధ్యాన వడకం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు సేలం మేత్రాసన పీఠాధిపతి ఆరుల రాయప్ప, ఏలూరు మేత్రాసన పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ ధ్యాన కార్యక్రమంలో ఫాదర్ పీ.బాల, ఫాదర్ మైఖేల్ ఇంజమాల, ఫాదర్ జార్జ్ స్టీవెన్, ఫాదర్ రాజు, ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ అమ్మన్న రాజాతో పాటు 150 మంది గురువులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రిమండలిలో దివ్యాంగులకు స్థానం కల్పించాలి

ఏలూరు (టూటౌన్): దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం–2016 ప్రకారం దివ్యాంగులకు అన్నింటిలో సమాన భాగస్వామ్యం కల్పించాలని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వానికి సంఘం తరపున స్వాగతం పలికారు. ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన మంత్రి మండలిలో దివ్యాంగులకు కేబినెట్ మంత్రిగా ఒకరికి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను దివ్యాంగులకు కేటాయించాలని అల్లాడి నటరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: అన్యాయంగా మూసివేసిన గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించి అందులో పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలని ఉద్యోగు లు డిమాండ్ చేశారు. మంగళవాఇరం గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎఫ్ కంపెనీ ఎదురుగా వారం రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న కంపెనీ ఉద్యోగులు అక్కడి నుంచి ప్రదర్శనగా నినాదాలు చేస్తూ గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు సీపీపీఎఫ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. కంపెనీని వెంటనే తెరిపించేందుకు కొత్తగా అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.పెంటారావు, పి.గోవింద్, గుత్తుల శ్రీనివాస్, దండు రామలింగరాజు పాల్గొన్నారు.

కన్యస్త్రీగా సిస్టర్ మేరీ మణీంద్ర

పెదవేగి : తన జీవితాన్ని దేవుని సేవకు అంకితం చేసిన సిస్టర్ మేరీ మణీంద్ర కన్యస్త్రీగా దైవ చింతనలో ఎన్నో విజయాలు సాధించాలని ప్రొవిన్షియల్ ఫాదర్ క్రీస్తురాజు, విచారణ గురువులు ఫాదర్ బాలస్వామి అన్నారు. పెదవేగి మండలం న్యాయంపల్లి విచారణ దేవరపల్లివారిగూడెంకు చెందిన దేవరపల్లి మేరీ మణీంద్ర ఎస్ఎన్‌డీ సంస్థలో వెస్ట్ బెంగాల్ కమల్పూర్‌లో మొదటి పట్టు స్వీకరించి మంగళవారం స్వగ్రామంలో మొదటి కృతజ్ఞత దివ్య బలిపూజను ఫాదర్లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గురువులు, కన్యస్త్రీలు, కుటుంబ సభ్యులు, సంఘ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

16న విజయదుర్గమ్మకు జలాభిషేకం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 16వ తేదీన జంగారెడ్డిగూడెంలో కొలువైన విజయదుర్గమ్మ అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, వ్యవసాయం, వ్యాపారాలు వృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుతూ జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16వ తేదీ ఉదయం 8.30 గంటలకు జలాభిషేకం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచి ఒక బిందెడు నీళ్లు తీసుకువచ్చి అమ్మవారి జలాభిషేకమునకు అర్చకులకు అందజేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి మోసపూరిత వాగ్దానాలు, విధానాలతో విజయాన్ని సాధించాయని దానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధపడొద్దని, వారికి అండగా నిలబడతానని ధైర్యంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని రాష్ట్ర సాహిత్యఅకాడమీ మాజీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. పార్టీలోని పరిస్థితులు, భవిష్యత్తు లో చేపట్టాల్సిన విధానాలపై ఆయన సూచనలు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హ యాంలో ప్రజలకు మేలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం ఏ విధానాలు అవలంభిస్తుందో వేచి చూ డాలని తెలిపారు. రాబోయే కాలంలో ప్రజలకు భరోసా కల్పించేలా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలి



ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ.సాల్మన్‌రాజు కోరారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ఇప్ట్యూ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు జే.సోమేశ్వరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో బోధన మాతృభాషలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ తెలుగు మరియు ఆంగ్ల మాధ్యమాలలో బోధన కొనసాగించాలని కోరారు. యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.రెడ్డిదొర మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించి ఆన్‌లైన్ కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ లేని ఉన్నత పాఠశాలలకు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు యూవీ.నరసింహరాజు, కే.ప్రకాష్, ఎస్.రమాదేవి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్‌కే.రంగావలి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి



డాక్టర్ మెండెం సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి నూతన ప్రభుత్వం సహకరించాలని ఏపీ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వానికి ఎస్సీ సర్పంచ్‌ల సంఘం తరఫున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా పంచాయతీలకు బదలాయించి పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. గ్రామ స్థాయిలో పంచాయతీలు స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలని గుర్తు చేశారు. పంచాయతీ వ్యవస్థలో రాజకీయాల ఒత్తిడి తీసుకు వచ్చి అధికారులపై పెత్తనం చెలాయించే విధంగా ఉండకూడదన్నారు. పంచాయతీ సర్పంచ్‌ల హక్కుల్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీల్లో పెత్తందారుల పెత్తనం లేకుండా సర్పంచ్‌లకే పూర్తి అధికారాలు కట్టబెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

భీమడోలు: మలేరియా రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ దోమల నిర్మూలనలో భాగస్వాములు కావాలని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీలక్ష్మీ అన్నారు. గుండుగొలనులో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా గ్రామంలోని వైద్య బృందం, ఆశా వర్కర్లు అవగాహన ర్యాలీ, ప్రదర్శన చేశారు. కరపత్రాలు అందించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఏటా జూన్ ఒకటో తేదీ నుంచి జూన్ నెలాఖరు వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించి ప్రజల్లో మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. శుక్రవారం ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. ఇండ్లలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కె.మల్లేశ్వరరి, ఎంపీహెచ్ఎస్ డి.రామకృష్ణ, హెచ్‌వీ షేక్ నవీన్, హెల్త్ అసిస్టెంట్లు రమేష్; మురళీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా నివారణ అందరి బాధ్యత

గణపవరం: మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.ప్రియాంక, సంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మలేరియా అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాలలో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవా లని, కొబ్బరి బొండాలు, పాత టైర్లు, పాత సామాన్లు వంటివి ఇళ్ల దగ్గర ఉంచరాదన్నారు. దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమ తెరలు వాడాలని, దోమల నివారణ కాయిల్స్ వాడాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారాలతో అభివృద్ధి చెందాలి

- 20 మందికి షాపుల లీజు రెన్యువల్
- ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్



షాపుల లీజుదారులకు అగ్రిమెంట్ రెన్యువల్ పత్రాలను అందజేస్తున్న నగర మేయర్ షేక్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ప్రభుత్వ సహకారంతో సక్రమంగా వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో మంగళవారం చేపట్టిన కార్యక్రమంలో ఏలూరు రిజిస్ట్రేషన్ ఆఫీస్ కార్యాలయ సమీపంలో కార్పొరేషన్ కాంప్లెక్స్‌లోని షాపుల లీజుదారులు 20 మందికి మూడేళ్ల కాల పరిమితి పెంచుతూ, 33 శాతం అద్దెను పెంచుతూ రెన్యువల్ చేసి పత్రాలను మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారస్తులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం సహకారాన్ని అందిస్తోందని తెలిపారు. అదే విధంగా అద్దె బకాయిలు ఉన్న లీజుదారులు సకాలంలో బకాయిలు చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలని మేయర్ నూర్జహాన్ కోరారు. కోఆప్షన్ సభ్యుడు పెదబాబు మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 25 మున్సిపల్ కాంప్లెక్స్‌లో 657 షాపులు ఉన్నాయని తెలిపారు. ఈ షాపుల ద్వారా అద్దె రూపంలో వచ్చే ఆదాయంతో కార్పొరేషన్ నిర్వహణ చేపడతామని తెలిపారు. బకాయిలు ఉన్న షాపుల యాజమాన్యాలు సకాలంలో అద్దెలను చెల్లిస్తే నగరంలోని ప్రజలకు కార్పొరేషన్ ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, శోభ, మీనాక్షి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్, సాయి, లీజుదారులు ఉన్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి



ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్, ప్రజా సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ పేరుతో ఆర్టీసీ ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి. అలాగే ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ ఏలూరు ఆర్టీసీ గ్యారేజ్ వద్ద జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఎలా అవుతుందని ప్రశ్నించారు. సుందరయ్య ఏ పార్టీకి ఎన్నికల్లో ప్రచారం చేయలేదని, పోటీ చేసిన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరలేదని, కానీ యాజమాన్యం అక్రమంగా, అన్యాయంగా సస్పెండ్ చేసిందని విమర్శించారు. సుందరయ్య అక్రమ సస్పెన్షన్ను వెంటనే రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఛలో ఏలూరు పిలుపు ఇస్తామన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు ఎస్ఎన్ రమేష్ మాట్లాడుతూ ఏలూరు డీపీటీవో ఆర్టీసీ ఉద్యోగులపై, నాయకులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలన్నారు. ఉద్యోగుల హక్కులను కాపాడవలసిన జిల్లా అధికారి ఇలా వ్యవహరించడం తగదని హితవు పలికారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీపీఆర్ దొర మాట్లాడుతూ ఏలూరు డీపీటీవో ఆర్టీసీ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు బీ. సోమయ్య, రైతు సంఘం నాయకులు కే.శ్రీనివాస్, అంగన్వాడి నాయకులు కే.విజయలక్ష్మి, వివిధ డిపోల నుండి ఆర్టీసీ నాయకులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత



పెదవేగిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

పెదవేగి : దోమలు మానవాళికి ప్రధాన శత్రువులుగా పరిణ మించయని, దోమల ద్వారా మలేరియా డెంగీ తదితర అనారోగ్య సమస్యలు వస్తాయి కాబట్టి దోమల నిర్మూలన ప్రజల భాగస్వామంతోనే సాధ్యపడుతుందని, దోమల నిర్మూలన ప్రజల సామాజిక బాధ్యతగా భావించాలని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెదవేగి ఆశా డే లో మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యునితో పరీక్షించుకుని చికిత్స పొందాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జే. గోవిందరావు మాట్లాడుతూ మంచి నీటిలో పెరిగి మన గృహాల్లో ఉండి మన రక్తాన్ని తాగి మనకే ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికెన్ గుని యా, మెదడువాపు మొదలు అంటు వ్యాధులు వ్యాప్తి చేసే దోమలు మనకు నిజమైన శత్రువులని, దోమలు పెరిగే స్థలాలైనా నీటి నిల్వ ప్రాంతాలు డ్రమ్ములు, మూతలు లేని నూతులు, టైర్లు, పగిలిపోయిన వస్తువులు, కొబ్బరి బొండాలు, సంపులు, రుబ్బురోలు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్ వెనుక బాక్సు తదితర స్థలాల్లో దోమలు పెరుగుతాయన్నారు. ప్రజలందరూ వారానికి ఒకటి లేక రెండుసార్లు నీటి నిలువ ప్రాంతాల్లో క్లీన్ చేసుకోవాలని పనికిరాని వస్తువులు విసర్జించాలని సాయంత్రం సమయంలో కిటికీలు, దోమ తెరలు, మస్కిటో కాయిల్స్, వాడాలని, దోమలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

పెదపాడు: అప్పనవీడులో అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం పురస్కరించుకుని 200 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళ్లేపల్లి సత్యన్నారాయణ, ప్రదీప్‌కుమార్ రాజు, సయ్యపు రాజు శ్రావణి, కళ్లేపల్లి అయాన్ సాయి సహకారం అందించారు. తొలుత స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు నూతన వస్త్రాలు అందజేత



పేదలకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలు అందిస్తున్న మానవత ప్రతినిధులు

భీమడోలు: ప్రతి ఒక్కరూ ఇతరులపై మానవత్వంతో మెలగాలని మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పూళ్ల, ఎంఎంపురం గ్రామాల్లోని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాల్లోని 11 పేద కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలను అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వట్టి సుగుణాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుని వారి కుటుంబాలకు ఆసరాగా నిలవాలన్నారు. సేవాతత్వంతోనే ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆ కుటుంబాలకు బియ్యం, ఇతర సరుకులు, సాయిరామ్ క్లాత్ యాజమాని పున్నం గోపి ఆర్థిక సాయంతో నూతన వస్త్రాలను అందించారు. మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు, మండల కార్యదర్శి ఆడబాల బాబి, అల్లాడ ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	17